# తోచని సంబంధం

రచన :
నరిశేపల్లి లక్ష్మినారాయణ

"క్షమించండి! నే నిచ్చట కూర్చోవచ్చా?" అని నా పాదాలవైపు చూస్తూ అతడు దీనవదనుడై, అస్పష్టంగా వినిపించు సన్నని స్వరంలో అడిగాడు. ఎప్పుడూలేని విసుగుతో శత్రుత్వాన్ని ప్రకటించు తీక్షణ దృక్కులతో అతని వైపు చూచాను. ఎవరైనవచ్చి నిదుర బోతున్న ప్రయాణికుల వీపునో, భుజాన్నో తట్టి లేపితే వారు అటువంటి "మూడ్"కు రావటం సహజం. సర్వ సామాన్యం; కాని అతడు స్వల్ప వయస్కుడు. వినయస్వభావు డవటంచే నేను అతడడిగిన దానికి తేలికగా "ఊహూ" అని అనలేక పొయ్యాను.

"కూర్చోండి" అని అన్నాను నా కాళ్ళను ముడుచుకోటంవల్ల ఏర్పడ్డ కొంత స్థలాన్ని చూపి.

"ఇది ఏ స్టేషను" అడిగాను.

"గుత్తి"........

"మీ రెంతవరకు వెళ్తున్నారు?"

"మద్రాసు"........

"అది చాల దూరప్రయాణం. నేను కూడా అక్కడికే వెళ్తున్నాను. ఉదయం 8 గంటలకుగాని మనం అక్కడకు చేరుకోలేం. అదీ ఈ వెధవ 'ట్రెయిను' ఎక్కడా టైం వృధా చెయ్యకపోతే. చదువుకుంటున్నావా?"

అవునండీ 'లా' చదువుతున్నాను.

"నీ సామాను ఎక్కడ?"

ప్రక్కనేఉన్న స్త్రీల కంపార్టుమెంట్‌లో ఉంచాను. ఇక్కడ పడుకోటానికి స్థలం చిక్కటం దుర్లభమని నాకు తెలుసు కనుక బెడ్డింగైనా ఇక్కడికి తెచ్చుకోలేదు.

కంపార్టుమెంట్‌లో ఎంత గోల ఉన్నా రాత్రి సమయం, అందులోను నిద్ర టైము కావటం వల్ల ఎప్పుడు నిద్రపొయ్యానో నిద్రపొయ్యాను.

ఉదయాన్నే ట్రైను ఏదో స్టేషనులో ఆగటంవల్ల ప్లాట్‌ఫారంమీదికిదిగి అల్లా సంచారం చేస్తూన్నాను. ఇంతలో సైడ్ కంపార్టుమెంటులోవున్న ఒకయువతితో మాట్లాడుతున్న అతన్ని చూచాను. టీయో లేక ఏదో వస్తువును తీసుకోవాలనే మిషతో, ఆమె సౌందర్యాన్నిచూచి ఆనందించాలనే ఆకాంక్షతో పలు మారులు అటూ ఇటూ తిరిగాను. అంతేకాదు కనీసం అతని దృష్టినైనా ఆకర్షిస్తే ఆయన నన్ను పిలచి ఆయనయొక్క............(ఆమె ఎవరైతేనేమి) పరిచయం చేస్తాడని తలచేవాడిని. "చాల అందమైన అమ్మాయి" నా అంతరాత్మ సన్నగా పలికింది. ఆమెయొక్క ఆ కర్ణాంత నయనాలు ప్రబంధనాయికలను మరిపించాయి. ఆమెకు పరిచయం చేయటానికి అతడు నన్ను ఆహ్వానించక పోవటంచేత నా ఆశాసౌధం కూలిపోయింది. కాని టీ బాయ్ తెచ్చిన టీ తోనే చివరకు సంతృప్తి నొందాల్సొచ్చింది. ఇంతలోనే అతడు కంపార్టుమెంటులోనికి వచ్చేసరికి "టీ" పుచ్చుకోండి అని అన్నాను. మరుక్షణంలోనే భయంకర శబ్దంచేసి పొగలు గ్రక్కుతూ ఇంజను బయలుదేరింది.

"థ్యాంక్సండీ! అప్పుడే కంపార్టుమెంటు ఎంత రద్దీగా ఉందండీ" అని అన్నాడు.

"కంపార్టుమెంటు పూర్తిగ నిండిపోయింది. మీ భార్య కులాసాయేనా?"

"ఒహ్ చాల థ్యాంక్సు! ఆమె నా భార్య కాదు."

"ఓ క్షమించండి" ముక్కును టీ కప్పులో ఉంచి మెల్లిగా గొణిగాను, నా బుఱ్ఱలో ఎన్నో ఆలోచనలు ఫిల్ము రీలులాగ గిఱ్ఱున తిరుగటం మొదలెట్టాయి. నా కుతూహలం అధికమైంది. ఆ అమ్మాయి ఎవరు? ఆ అమ్మాయికి ఇతనికి గల సంబంధమేమిటి? ఇత్యాది ఆలోచనలతో నా బుఱ్ఱ వేడెక్కిపోయింది. ఈ విషయమై అతన్ని సూటిగా అడగడానికి అవసరమైన స్థిర ధైర్యాలు నా కున్నాయని వెంటనే తోచింది. కాని ఏ విధంగానైనా ఆయన బంధువైన ఆమె ఎవరో కనుక్కోవటమందు అతనివద్ద కనబరచే నా కుతూహలం అనమంజసమని, అనౌచిత్యమని, అసందర్భమని తోచటంవల్ల నే నా ప్రయత్నం విరమించుకున్నాను. ఆమె ఒక మారు నా వైపు చూచింది. అంతేకాదు. నాపై ఆమెకు మంచి అభిప్రాయ మేర్పడినట్లు మనస్తత్వశాస్త్రరీత్యా ఆమె వదనారవిందమునందలి మార్పునుబట్టి గ్రహించాను. ఆమె ఇతని భార్య మాత్రం కాదని తేలిపోయింది. కొంతవరకు అది నా ఆశను చిగురింపచేసినది. ఆ విషయమై ఆచూకీ తీయటానికి నేను మరో మార్గం త్రొక్కాలని నిశ్చయించుకొన్నాను.

"మీరు గుత్తినుండి వస్తున్నారా" అడిగాను.

"అవును"..........

"బహుశా బంధువుల నెవరినైనా చూడటాని కెళ్ళారేమో"

"ఊహూ లేదండీ"

"వివాహమేదైనా ఉండిఉంటుందనుకుంటాను"

అతడు చిన్నగా తల ఊపాడు.

"ఓహో ఇది పెళ్ళిళ్ళ సీజను కదూ"

అతను మరలా తల ఊపాడు.

"అంటే మీరు వివాహంనుండి తిరిగి వస్తున్నా రన్నమాట. మీరు మీయొక్క........ మీ చెల్లెను హి హి హి"

"అవును. వివాహంనుండి తిరిగి వస్తున్నాము. ఆమె నా చెల్లెలుకాదు"

ఒహ్ క్షమించండి"

కనుక ఆమె అతని చెల్లెలూకాదు. ఇటు భార్యా కాదు. ఐతే ఆమె ఎవరైనట్టు? నా కుతూహలం ఎక్కువైపోయింది. "ఆమె ఎవరో తెలుసుకోవాలి" లేదా "పిచ్చివాడుగానైనా కావాలి" అనేంతవరకు వచ్చింది నా పరిస్థితి. అతనిచూస్తే ఘటికునివలె ఉన్నాడు. ఇంతవరకు అతను డొంక తిరుగుడు సమాధానాలే ఇస్తున్నాడు. ఆమె అతని భార్యకాదు, చెల్లెలూకాదు. అటువంటప్పుడు ఆమె ఎవరో అతనెందుకు చెప్పగూడదు? అని నా అంతరాత్మ వేసిన ప్రశ్నకు నా మెదుడు సమాధానమివ్వలేకపోయింది.

"మీ జిల్లాలో చదువుకున్న స్త్రీల శాతమెంత?" అని మరలా అడిగాను. నేను మీ అత్త ఇప్పుడే ఒక ఇంగ్లీషు పత్రిక చదవటం చూచాను"

"ఆ శాతమెంతో నేను మీకు సరిగ్గా చెప్పలేను. మొత్తానికి చాల తక్కువ యని మాత్రం దృఢంగా చెప్పగలను. మీ రన్నట్లు ఆమె నాకు అత్తకాదు."

"ఓహో క్షమించండి"

కనుక ఇతను–ఆమెల మధ్యగల సంబంధమేమిటి? ఇది తెలుసుకొటానికి ఇలాగే ఏదో ఒక విధంగా ఒక బంధుత్వాన్ని సృష్టించి సత్యాన్వేషణ చేయటంకంటే నాకు మరో మార్గం అగుపించలేదు. ఈ సంఘటన నాకు చాల ఆశ్చర్యం కలిగించింది. అంతులేని నా ఆశ్చర్యానికి తగ్గట్టు ఈ గట్టి పిండమొకటి తారసిల్లింది. కాని నేనింకా ప్రయత్నంచేస్తే బావుంటుందని తోచటంచేత రక్తం కుత కుత మని ఉడకటంచేత నా ప్రయత్నాన్ని ఉపసంహరించుకోలేక పొయ్యాను.

ఏదో స్టేషను రావటంవల్ల ట్రైను ఆగింది. బెర్తుపైనఉన్న నా టిఫిను బుట్టను క్రిందికి దించి అందులోంచి కొన్ని పూరీలనుతీసి అక్కడే నా ముందరున్న న్యూస్‌పేపరుమీద ఉంచాను.

"రండి టిఫన్‌చేద్దాము"అని అతన్ని ఆహ్వానించాను.

"అలాగేనండి. థ్యాంక్సు"

"ఇందులో కొంత మీ........మీ కోడలుకు తీసుకెళ్ళరా?"

"లేదు. ఆమె తనతోబాటు కొంత భోజనం తెచ్చుకున్నది. ఆమె నా కోడలు కాదు."

"ఓహో క్షమించండి" నిశ్శబ్దంగా మేము తినటం ప్రారంభించాము.

భార్యకాదు, చెల్లెలుకాదు, అత్తకాదు, కోడలుకాదు 'డిటెక్షన్'లో పురోగమిస్తున్నాను. ఈ ఆలోచన కల్గగానే ఆనందపూరితమైన హృదయం ఈ క్రియను కొన్ని నాడులద్వారా మెదడుసకు తెలియచేయటంవల్ల దానికి ప్రతిక్రియగా ఒక్క చిరునవ్వు నవ్వాను.

"మీకు అన్నదమ్ములెందరున్నారు?" అడిగాను.

"ముగ్గురు"

"పెద్దాయన వున్నాడా"

"అవును"

"వివాహమైనదా?"

"మరీ పెద్దాయనకు ఐంది"

"ప్రక్క కంపార్టుమెంట్‌లో ఉన్న మీ.... మీ వదినది ఏ గ్రామం?"

ఓహో, ఆమె స్వస్థలం గుత్తి. ఆమె నా వదిన కాదు"

మరల చప్ప మొహం. గుండెల్లో అగ్ని ప్రజ్వరిల్లింది. ఎంత దగ్గరి సంబంధాలను సృష్టిస్తున్నానో సత్యానికి అంత దూరంగా వెడుతున్నాను. క్షణక్షణం నా కుతూహలం పెరిగిపోతుంది. ఇతర సంబంధా లేవైనా ఉన్నాయాని దీర్ఘకాలంవ్యయంచేసి నిశితంగా ఆలోచించటం ప్రారంభించాను. ఆలోచించాను. కాని దురదృష్టంకొద్దీ నా బుఱ్ఱకు ఒక్కటీ తట్టలేదు. నేను విశ్వప్రయత్నం చేసినా చివరకు ఈ చిదంబర రహస్యమేదో సాధించి కనుక్కోలేక పొయ్యాను. అల్లంత దూరాన సెంట్రల్ స్టేషనులోని సిగ్నలు రెక్క క్రిందికి వాలటంవల్ల ప్రయాణీకులంతా తమ పరుపులు చుట్టుకోవడం, సామాన్లు సరిబెట్టుకొవటం జరుగుతూంది.

"మనం చివరకు ఊరు చేరుకున్నాం" అన్నాడు ఆ ఉత్సాహవంతుడైన యువకుడు.

"అవును. భగవంతుని కృపవల్ల చేరుకున్నాము. ఇది దూర ప్రయాణం కావటంవల్ల చాల విసుగును పుట్టిస్తుంది. ముఖ్యంగా స్త్రీలకు ఎక్కువ అలసట కలిగించివుంటుంది. మనం మద్రాసు చేరగానే మీ లేడీ ఫ్రెండ్ చాల సంతోషిస్తుందని నేను దృఢంగా చెప్పగలను."

ఈ మాటలకు అతడు వెంటనే నావైపు తిరిగి చూచాడు. "మీ రన్నట్టు ఆమె చాల సంతోషిస్తుందని నా దృఢ విశ్వాసం. ఆమె నా లేడీ ఫ్రండ్ కాదు" అని పలికాడు. ఇది నన్ను నిరాశాపరుడుగను, క్రోధోన్మత్తునిగను చేసింది.

"ఐతే ఆమె ఎవరు?" వెఱ్ఱివానివలె గట్టిగ అరిచాను. గత పంట్రెండు గంటలనుండి ఆమె ఎవరో కనుక్కోటానికి ప్రయత్నం చేస్తున్నా కాని నీవు చెప్పలేదు. ఎందుకు? ఆమె నీ భార్యకాదు, నీ చెల్లెలుకాదు, నీ అత్తకాదు, నీ కోడలూకాదు, వదిన కూడా కాదు. ఐతే ఆమె ఎవరైనట్టు? ఇలా ప్రశ్నిస్తూనే నిస్పృహతో బయటికి చూచాను. దూరాన ఉన్న చెట్లు నా దగ్గరగావచ్చి మరల దూరంగా వెళ్ళిపోతున్నాయి. టెలిగ్రాఫు తీగెలు పైకిపోయి క్రిందికివచ్చి మరల పైకి పోతున్నాయి.

"నీవు నన్ని విషయ మెందుకు అడుగలేదు?" ఆనంద పూరిత నయనాలతో అమాయకత్వంగా నా వైపు చూస్తూ అనిగాడతడు.

"నీవు కేవలం ఊహలు చేస్తూ రావటంవల్ల నేను వాటిని సరిదిద్దుతూ అలాగే ముందుకు సాగిపొయ్యాను.

పోనీ అడిగారా చెప్పండి?" అతను మరలా అడిగాడు.

ట్రెయిను ప్లాట్‌ఫారంమీద ఆగింది.

"లేదు. నేను అడుగలేదు" ఇది నేనంగీకరిస్తాను. కాని ఇప్పుడు అడుగుతాను చెప్పండి. ఎవరామె?

"ఆమె నా మారుతల్లి" అతడు చల్లగా సమాధానమిచ్చి మెల్లగా ప్లాట్‌ఫారమ్ మీదికి దిగిపొయ్యాడు. వెళ్ళిపోతున్న అతని వైపు చూస్తూ అలాగే కూర్చున్నాను కొన్ని క్షణాలు. అది మాత్రమే నాకు తోచని సంబంధం.

(ఆంగ్లాధారంగా)

★

